క్లుప్తంగా

వనదుర్గ అమ్మవారికి చండీహోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు ముష్టి పురుషోత్తం, చిట్టెం వాసు, చల్లపల్లి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్షకుంకుమార్చన

రత్నగిరిపై ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ఘనంగా రూపులమ్మ తీర్థమహోత్సవం



ఏలేశ్వరంలో రూపులమ్మ వారిని దర్శించుకుంటున్న భక్తులు

ఏలేశ్వరం: గ్రామదేవత రూపులమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక మార్కెట్ సెంటర్‌లో వేంచేసిన అమ్మవారి ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పలు రకాల దుకాణాలు ఏర్పాటుచేశారు. ఆలయం వద్ద నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులు అమ్మవారిని దర్శించుకొనేందుకు ఆలయాన్ని వారంరోజుల పాటు తెరిచే ఉంచనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆర్‌బీకేల్లో సంప్రదించండి

గండేపల్లి: అర్హతలు ఉండి రైతు భరోసా పథకంలో ఆర్థిక సాయం పొందని రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి సూచించారు. భూమి గల రైతులు ఆధార్, పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌లతో పొలం ఉన్న ప్రాంతంలోని రైతు భరోసా కేంద్రంలో వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ నెల 30తో గడువు ముగుస్తుందని తెలిపారు. ఇప్పటివరకూ పీఎం కిసాన్ సాయం పొందని రైతులు దగ్గరలోని మీ సేవ కేంద్రంలో ఆధార్, పట్టా జెరాక్స్, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌ను తీసుకువెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. పీఎం కిసాన్, ఈ–కేవైసీ నమోదు ప్రక్రియకు ఈ నెల 30తో గడువు ముగుస్తుందన్నారు. రైతులు త్వరితగతిన ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాలని సూచించారు.

వాహనాల తనిఖీ



ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జగ్గంపేట: మండల పరిధిలోని జాతీయ రహదారిపై స్పీడ్ గన్‌తో వాహనాలను తనిఖీ చేసినట్టు శుక్రవారం స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. పరిమితికి మించి వేగంగా వెళుతున్న 66 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. వాహన యజమానులకు రూ.28710 అపరాధ రుసుము విధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అతివేగంతో జాతీయ రహదారిపై పలు ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. జగ్గంపేట జేవీఆర్ జంక్షన్ వద్ద ద్విచక్ర వాహనదారులు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన

కోటనందూరు: స్థానిక సింహాద్రి కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సర్పంచ్ శివలక్ష్మి, ఎంపీపీ లగుడు శ్రీనివాసు శుక్రవారం శంకుస్థాపన చేశారు. నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి దాడిశెట్టి రాజా ఇచ్చిన హామీ మేరకు సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టినట్లు ఎంపీపీ శ్రీనివాసు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు దార్ల సూర్యచంద్ర, కురందాసు రాంబాబు, ఉల్లూరి శ్రీను, చింతల దొరబాబు, గర్సింగు శ్రీనివాసు, మళ్ల సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలే లక్ష్యం



అన్నవరంలో లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- అన్నవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

అన్నవరం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, గత నాలుగేళ్లలో 95 శాతం హామీలను నెరవేర్చారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. అన్నవరంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి మూడో సచివాలయం పరిధిలోని తారకరామ కాలనీ, బీసీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైన్లు, పింఛన్లు తదితర సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ సర్పంచ్ కుమార్ రాజాను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరే ఇతర రాష్ట్రంలోనూ లేవన్నారు. తమ ప్రభుత్వంలో అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. అనంతరం విశ్రాంత వైదిక కార్యక్రమాల పర్యవేక్షకుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు రవిశర్మ ఆధ్వర్యంలో పురోహితులు ఎమ్మెల్యే పర్వతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, వైస్ ఎంపీపీ ధారా వేంకట రమణ, ఎంపీడీఓ రాంబాబు, అన్నవరం సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా, ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

సారూ.. ఇదేం తీరు

- విద్యార్థులతో ఇంటిపనులు చేయిస్తున్న ఉపాధ్యాయుడు
- ఆందోళన చేసిన తల్లిదండ్రులు
- విచారణ చేపట్టిన అధికారులు



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పోలీసులు, అధికారులు

జగ్గంపేట: గ్రామ శివారు సీతానగరంలో 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులతో ఇంటి పనులు చేయిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళితే.. నగరం గ్రామంలోని ప్రైమరీ స్కూల్‌లో ఎంజే ఆనందబాబు గత ఏడు సంవత్సరాలుగా హెచ్‌ఎంగా పనిచేస్తున్నాడు. ఆయన ప్రవర్తన గత కొంతకాలంగా విచిత్రంగా కనిపిస్తోందని గ్రామస్తులు ఆరోపిసున్నారు. నగరం గ్రామంలో పనిచేస్తున్న ఆనందబాబు నాలుగు కిలోమీటర్ల దూరంలోని కాత్రావులపల్లిలో నివాసం ఉంటున్నారు. ఆయన గత కొంత కాలంగా 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులను రోజుకు ఇద్దరు చొప్పున ఇంటికి తీసుకువెళ్లి ఇల్లు తుడవడం, మొక్కలకు నీళ్లు పోయడం, బూజులు దులపడం, గిన్నెలు తోవడం లాంటి పనులు చేయించుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ఇప్పటివరకూ ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పకపోవడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. విద్యార్థులు నగరం గ్రామం నుంచి కాత్రావులపల్లి వెళుతున్నారనే విషయం తల్లిదండ్రులకు తెలిసి పిల్లలను గట్టిగా అడగడంతో మాస్టార్ చేస్తున్న నిర్వాకం బయటపడింది. దీంతో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు తక్షణమే ఉపాధ్యాయుడు ఆనందబాబుపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. విషయం తెలిసిన వెంటనే జగ్గంపేట ఎంపీపీఓ హరికృష్ణ విచారణకు ఆదేశించడంతో ఇన్‌చార్జీ ఎంఈఓ కేహెచ్ నాయక్ విచారణ చేపట్టారు. 16 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులను విచారించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్, గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా, వైఎస్సార్ సీపీ నేత కరుటూరి రాజు, ఈటీపీఆర్డీ భారతి అక్కడకి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు. విచారణ నివేదికను జిల్లా విద్యాశాఖాధికారికి పంపిస్తామని ఎంఈఓ నాయక్ తెలిపారు. కాగా విద్యార్థులు తన ఇల్లు చూస్తానంటే కాత్రావులపల్లి తీసుకువెళ్లినట్లు ఉపాధ్యాయుడు ఆనందబాబు చెబుతున్నారు.

ముస్లింలకు ఎంపీపీ ఇఫ్తార్ విందు



గోకవరం మసీదులో ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని జుమ్మా మసీదులో ముస్లింలకు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతులు శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. తొలుత మసీదులో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, సుంకర వెంకటరమణ, ఎస్సై యువి శివనాగబాబు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్ కుమార్ ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, చంటిసాహెబ్, మసీదు పెద్దలు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం



108 వాహనంలో జన్మించిన ఆడబిడ్డను చూపుతున్న వైద్య సిబ్బంది

శంఖవరం: మండలంలోని మండపాం గ్రామానికి చెందిన ఓ గర్భిణి శుక్రవారం 108 వాహనంలో పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళితే.. మండపాం గ్రామానికి చెందిన గర్భిణి కొల్లు నూకరత్నానికి పురిటి నొప్పులు రావడంతో 108లో కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో మార్గ మధ్యలో పిఠాపురం వద్ద జాతీయ రహదారిపై 108 వాహనాన్ని నిలిపి గోముల రాజబాబు, పైలెట్ కరణం సుధాకర్, ఆశా వర్కర్ నాగమణి కుటుంబ సభ్యుల సహకారంతో ఆమెకు పురుడు పోశారు. ఆ తల్లి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా పిఠాపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

బెండపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

తొండంగి: మండలంలోని మేజర్ పంచాయతీ బెండపూడిలో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఏలేటి దుర్గాదేవి, పంచాయతీ కార్యదర్శి వాడ్రేవు చక్రవర్తి పర్యవేక్షణలో శానిటరీ సిబ్బంది గ్రామంలో రోడ్లపై వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. మరమ్మతులకు గురైన చేతిపంపులను బాగు చేయించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎంపీపీ అంగులూరి అరుణ్‌కుమార్
- తొండంగిలో మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అరుణ్‌కుమార్

తొండంగి: అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, దీనికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషిచేయాలని ఎంపీపీ అంగులూరి అరుణ్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అరుణ్‌కుమార్ అధ్యక్షతన మండల సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ పసపులేటి సతీష్ గ్రామాల్లో జరిగిన ప్రగతి, అభివృద్ధి పనులను వివరించారు. ఐసీడీఎస్ తుని రూరల్ సీడీపీవో నాగమణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మొదటి విడత ఏప్రిల్ 15తో ముగిసిందని, రెండో విడతగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని చెప్పారు. అన్ని గ్రామాల్లోనూ కూలీలకు ఉపాధి హామీపథకం ద్వారా పనులు కల్పించేందుకు వర్కులు సిద్ధం చేశామని ఏపీవో బి.సత్యనారాయణ తెలిపారు. ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వేసవి వడదెబ్బలు తగులుతున్నాయని, ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు మండల వ్యవసాయాధికారి ఎస్.నరసింహం తెలిపారు. అనంతరం శాఖల వారీగా ప్రగతిపై ఎంపీపీ సమీక్షించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎంపీపీ ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నాగం గంగబాబు, యాదాల రమణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి ఆంజనేయులు, ఎంపీడీఓ పసపులేటి సతీష్, ఈవోపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, ఎంఈవో షేక్‌బాబ్జీ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్యామ్, పంచాయతీ కార్యదర్శులు వాడ్రేవు చక్రవర్తి, ప్రేమ్‌కుమార్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అలమండ సత్యవతి

ఏలేశ్వరం: పట్టణంలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అజెండాలోని అంశాలను చదువుతుండగా 10, 12వ వార్డు కౌన్సిలర్లు కోరాడ రామలక్ష్మి, సామంతుల హైమావతి గత సమావేశంలో తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదని కమిషనర్ కె.శ్రీనివాసరావును ప్రశ్నించారు. సభ్యులు ప్రశ్నలను లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని కమిషనర్ కోరారు. కో ఆప్షన్ సభ్యుడు వాగు బలరామ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు కమ్యూనిటీ హాలు నిమిత్తం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ చొరవతో రూ.25 లక్షలు కేటాయించగా ప్రస్తుతం రూ.15 లక్షలు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మరో కో ఆప్షన్ సభ్యుడు దిలబర్ హుస్సేన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆదేశాలతో పట్టణంలో తమ కమ్యూనిటీ హాలుకు స్థలం కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను ట్రాన్స్‌కో ఏఈ సూర్యనారాయణను కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆదేశించారు. దీనిపై ఏఈ మాట్లాడుతూ పట్టణంలో కొత్తగా 75 విద్యుత్‌స్తంభాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. దీని నిమిత్తం నగర పంచాయతీ ముందుగానే రూ.50 లక్షలు చెల్లించిందన్నారు. కార్యక్రమంలో టీపీఓ ఆనంద్, ఏఈ అనూష, వైస్ చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్యం జగన్‌తోనే సాధ్యం



సోమరాయణంపేటలో మహిళలకు పథకాలు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జగ్గంపేట: మహాత్మా గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో చేసి చూపించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలో శుక్రవారం ఆయన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్

కిర్లంపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సోమరాయణంపేటలో వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్ సరిసే కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వానికి మద్దతు పలికిన వారి ఇంటి గోడలకు సీఎం జగన్ ఫొటోతో కూడిన స్టిక్కర్లు అతికించారు. గృహసారథులు రాపేటి సుబ్రహ్మణ్యం, సరిసే కృష్ణాజీ, కొణతాల ఈశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని అధికారులపై చర్యలు

మండల సమావేశంలో ఎంపీపీ బొప్పన రాము



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బొప్పన రాము

తుని రూరల్: గ్రామాల్లో నెలకొనే ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రాము అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయ, ట్రాన్స్‌కో, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ తాగునీరు, పారిశుధ్యం, గృహనిర్మాణ, రెవెన్యూ, తదితర శాఖల పనితీరుపై సమీక్షించారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా విద్యుత్ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని అటికివానిపాలెం, లోవకొత్తూరు సర్పంచులు, వి.కొత్తూరు ఎంపీటీసీ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంపీపీ బొప్పన రాము స్పందిస్తూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. సమావేశానికి హాజరుకాని ఆయా శాఖల అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు చేర్చడంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. రానున్న ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన నాలుగు రకాల వరి, పత్తి విత్తనాలు, ఎరువులను ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉంచుతున్నట్టు ఏఓ అశోక్ కుమార్ తెలిపారు. మిషన్ వాత్సల్య పథకం నిరంతర ప్రక్రియ అని, ప్రతి నెలా 15వ తేదీలోపు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవచ్చని సీడీపీఓ నాగలక్ష్మి సభ్యులకు తెలియజేశారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.శివాజీ తెలిపారు. తొలిసారిగా సమావేశానికి హాజరైన డీసీసీబీ డైరెక్టర్, సీనియర్ నాయకుడు పోలిశెట్టి సోమరాజును ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీలు చోడిశెట్టి సత్య నాగేశ్వరరావు, చిటికెల సత్యవతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



తునిలో మజ్జిగ చలివేంద్రాన్ని పారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, కమిషనర్ ప్రసాదరాజు

తుని: వేసవిలో పనుల కోసం పట్టణానికి వచ్చిన బాట సారుల దాహార్తిని తీర్చేందుకు పురపాలక సంఘం మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. శుక్రవారం రాజా కళాశాల మైదానం సూరవరం రోడ్డు, జీఎన్‌టీ రోడ్డు పెట్రోల్ బంకు ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాలను కమిషనర్ ప్రసాదరాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం వేళల్లో బాటసారులకు మజ్జిగను ఉచితంగా అందిస్తామని, ఇందుకు అయ్యే ఖర్చును పురపాలకసంఘం భరిస్తుందన్నారు. త్వరలో మరికొన్ని చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. బాలాజీ సెంటర్‌లో దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దాడిశెట్టి విష్ణుచక్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్ర రెడ్డి, బాలికల కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, జెడ్ ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లో మంత్రి దాడిశెట్టి రాజా ఆర్థిక సహాయంతో సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు ప్రారంభించారు. ప్రస్తుత వేసవిలో ప్రయాణికులు, గ్రామ ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ శ్రీనివాసు తెలిపారు. తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, రుత్తల జోగిరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

తుని రూరల్: పాఠశాలల్లో సిబ్బంది పనితీరును మెరుగుపరిచేందుకు, జవాబుదారీతనం పెంచేందుకు సామాజిక తనిఖీలు పారదర్శకంగా జరగాలని కాకినాడ జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ, ఐఈ కోఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు అన్నారు. తుని మండల రిసోర్స్ సెంటర్‌లో ఎంఈఓ పరవాడ గీతాదేవి అధ్యక్షతన శుక్రవారం ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ సామాజిక తనిఖీలతో పాఠశాలల్లో పారదర్శకత పెరుగుతుందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థుల మానసిక, సామాజిక భద్రత, ఆరోగ్యం, భౌతిక భద్రత, పాఠశాలలకు నిధుల విడుదల, వ్యయం, ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు, ప్రగతి, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, ఏకరూపు దుస్తులు, తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని యాప్ ద్వారా సేకరించి మూల్యాంకనం చేయడంపై శిక్షణ ఇచ్చారు. సామాజిక తనిఖీలు జరగడం వల్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీలు ప్రభుత్వ పాఠశాలల పట్ల మరింత బాధ్యతగా వ్యవహరిస్తారన్నారు. సామాజిక తనిఖీల ఆవశ్యకత, వినియోగం, యాప్ ద్వారా సమాచార సేకరణ, తదితర అంశాలను రిసోర్స్ పర్సన్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. రిసోర్స్‌పర్సన్లు కేవీ సుబ్బిరెడ్డి, ఎం.శివయ్య, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే గేటు మూత.. ప్రయాణికులకు వెత



రైల్వే గేటు మూత పడడంతో నిలిచిపోయిన వాహనాలు

తొండంగి: మండలంలోని గోపాలపట్నం రైల్వే గేటు శుక్రవారం మరమ్మతులకు గురవ్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. తొండంగి నుంచి గోపాలపట్నం వెళ్లే రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎలక్ట్రానిక్ ఆపరేటింగ్ లిఫ్టింగ్ బ్యారియర్స్ (ఈఓఎల్‌బీ)లో సాంకేతికపరమైన సమస్య తలెత్తడంతో రైల్వే సిబ్బంది గేటును మూసి వేశారు. దీంతో నాలుగైదు రైళ్లు వెళ్లే వరకూ గేటు వేయాల్సి వచ్చింది. వాహనదారులు ఎండలో వేచి ఉండలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరమ్మతులు అనంతరం వాహనాల రాకపోకలు యథాతథంగా సాగాయి.

'నాడు-నేడు' పనుల పరిశీలన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను శుక్రవారం ఎంఈఓ వి.రాజబాబు పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పలు సూచనలు చేశారు. నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఆర్పీ రాంజీ ప్రసాద్, హైస్కూల్ హెచ్‌ఎం మధుసూదన్‌రావు ఉన్నారు.

దివ్యాంగురాలికి చేయూత

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెంలో దివ్యాంగురాలికి శుక్రవారం యువకులు అండగా నిలిచారు. స్థానిక పీడీవై హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో దివ్యాంగురాలు గెడ్డం ఏసురత్నంకు బియ్యం, నిత్యావసర వస్తువులతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. దివ్యాంగురాలికి అండగా నిలిచిన యువకులను గ్రామ పెద్దలు అభినందించారు. గ్రామంలో ఎవరికి ఎలాంటి అవసరం వచ్చిన సహాయం చేస్తామని యువకులు తెలిపారు.

70 మందికి కంటి పరీక్షలు

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఏవీనగరం పీహెచ్‌సీ పీహెచ్‌సీ వైద్యులు పి.రవికుమార్, భారతి 70 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 11 మందికి ఆపరేషన్లు, 23 మందికి కళ్లజోళ్లు అవసరమని నిర్ధారించారు. కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, బెక్కం చంద్రగిరి, ఎంపీటీసీలు నందెపు చిన్న, ఎలుగుబంటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.